

# కొయ్య గుర్రం

- మధు చక్రవర్తి

ఉగాది పోటీలో ఎంపికైన కథ

ఒక్కసారి గుండెల్నిండా గట్టిగా గాలి పీల్చుకున్నాను...

ఏదో తెలీని తెగింపు... శరీరంలో ఉరుకుతూన్న కొత్త ఉత్సాహం... అంతే! ఆరడుగుల ఎత్తు ప్రహరీ గోడ మీంచి అమాంతం కిందికి దూకేశాను. ఐతే... అలవాటు లేక... నిలదొక్కుకోలేక, కింద గడ్డి నేలపై బొక్కబోర్లా పడ్డాను. పడ్డ వెంటనే గబాల్న లేచి, వొళ్లు తుడుచుకుంటూ తలెత్తి చూసాను.

ఎదురుగా... శీతాకాలపు వెన్నెల్లో... సన్నపాటి మంచు తెరలో... ఆ బంగ్లా నిండుగా... ఎంతో అందంగా... హుందాగా వుంది. ఆకలితో ఆవురావురుమని ఇంటికొచ్చే బిడ్డకోసం ఎదురుచూస్తూన్న అమ్మలా ఉంది. ఆ బంగ్లాముందు శీతగాలికి తలలూపుతూన్న బంతి పూల మొక్కలు, చిరకాలపు చెలికానికి స్వాగతం పలుకుతూన్న చిననాటి నేస్తాల్లాగున్నాయి.

నేను నక్కుతూ... నక్కుతూ బంగ్లా వెనక్కి వెళ్లి, మూసి ఉన్న పెరడి తలుపుని నెమ్మదిగా నెట్టాను.

అదృష్టం!...

తెరుచుకుంది... హమ్మయ్య! అదృష్ట దేవతకి 'దొంగ... దొర' భేదం లేనట్టుంది. తలుపులు పగలగొట్టే శ్రమ తప్పినందుకు మనసులోనే మురిసిపోతూ లోనికి అడుగుపెట్టాను. తెరిచిన తలుపు సందుగుండా లోపలికి పలచగా, పరచుకున్న వెన్నెల కాంతిలో గది లోపలి భాగం అస్పష్టంగా కనిపిస్తోంది.

అది వంట గది...

అంత క్రితమే, ఇంటివాళ్లు భోజనాలు చేయగా, మిగిలిన వంటకాల్ని భోజనాల టేబులుపైనే ఉంచేసినట్టున్నారు... ఘుమ ఘుమ వాసనలు నాసికా పుటాలను తాకేసరికి, అప్పటికి ఆర్రోజులుగా అణచుకుంటున్న ఆకలి 'ఆక్టోపస్'లా ఒక్కసారిగా విజృంభించింది. అయితే అంతలోనే ఆకల్ని మించిన మరో ఆలోచన... నాకిప్పుడు కావలసింది ఒక పూట ఆకలి చల్లారడం కాదు... జీవితంలో మరెప్పుడూ ఆకలి బాధ తెలీనీయనంత 'డబ్బు'... అవును... మనిషి ఆశించే... మనిషిని శాసించే... ఆఖరికి ఈ సమస్త లోకాన్ని ఆడించే 'డబ్బు!'... అదే కావాలి! అందుకే దోచుకోవాలి! వీలైనంత ఎక్కువ దోచుకోవాలి! చేతికి అందినంత దోచుకోవాలి!

ఒకటా... రెండా... దాదాపు వారం రోజులుగా, ఒకటికి పదిసార్లు. ఈ వీధినంతా 'సర్వే' చేసి, 'సోదా' చేసి మరీ ఈ ఇంటిని ఎంపిక చేసుకున్నాను.

ఈ అవకాశాన్ని జారవిడుచుకోకూడదు!

అదృష్టం కూడా నా పక్షానే ఉన్నట్టుంది!

ఇక ఆలోచించలేదు; సరాసరి వంట గదిలోంచి లోపలికి నడిచాను.

లోపల... పెద్ద హాలు...

'జీరోవాట్' బల్బు కాంతిలో అంతా అస్పష్టంగా కనిపిస్తోంది. ఇంట్లో ఎవరూ ఉన్న అలికిడి లేదు. అందుకే పథకం ప్రకారం ఎవరూ లేనప్పుడే ఇంట్లోకి ప్రవేశించాలనుకున్నాను. ఇంత క్రితమే ఇంట్లో వాళ్లందరూ కార్లో ఎక్కడికో వెళ్లడం చూశాకే, గోడ దూకి లోపలికి ప్రవేశించాను.

మళ్లీ వాళ్లొచ్చే లోపలే నా పని చక్కబెట్టుకోవాలి!

ఆలోచన వచ్చిందే తడవుగా ధైర్యంగా వెళ్లి, లైట్ 'స్విచ్'వేశాను. విశాలమైన హాలంతా తెల్లటి ట్యూబులైట్ వెలుగు వ్యాపించింది.

ఓసారి అంతా పరికించాను...

ఎటు చూసినా, భారీ సినిమా సెట్టింగు లాంటి ఖరీదైన ఫర్నీచరు... కళ్లు 'జిగేల్'మనిపించే విలువైన వస్తువులు... అయితే నాక్కావలసింది ఇవేమీ కాదు. బరువు తక్కువగా ఉండి, విలువ ఎక్కువ పలికే బంగారు నగలు... వజ్ర వైఢూర్యాలు... నగదూ నట్రా మాత్రమే!

హాల్లోంచి మెట్లమీదుగా మేడ పైకి వెళ్లాను.

అనుకున్నట్టుగానే, వెళ్లిన ఓ గంట వ్యవధిలో నా భుజాన వ్రేల్లాడుతున్న 'ప్లాస్టిక్ బ్యాగు' బంగారు నగల్తో... కరెన్సీ కట్టల్తో నిండిపోయింది. నా గుండె కూడా ఏదో తెలీని ఉద్వేగంతో బరువెక్కిపోయింది.

ఇక ఇక్కణ్ణించి ఎంత తొందరగా బైటపడితే అంత మంచిది.

ఆలోచన వచ్చిందే తడవుగా, గబగబా మెట్లుదిగి, కిందికొచ్చాను. మెట్లకు ఎడమవైపు తిరిగి, మళ్లీ దొడ్డిద్వారం గుండానే బైటికి జారుకుందామనుకుంటున్న సమయంలో కనిపించిన ఆ దృశ్యం నన్ను అచేతనుణ్ణి చేసింది!

ఒక్కసారి నా నరనరాల్లో ప్రకంపన మొదలైంది... తడబడే అడుగుల్తో, అడుగులో అడుగేసుకుంటూ, అటువైపు నడిచాను. అడుగడుక్కీ దగ్గరవుతూ... సరిగ్గా అడుగు దూరంలో ఆగిపోయాను.

నా ఎదురుగా... మెట్లకింది గూడులో... నిశ్చలంగా ఉందది. రిక్కించిన చెవుల్తో... చురుకైన చూపుల్తో... కుచ్చులా జాలువారే తోకతో... దృఢమైన నాలుగు కాళ్లతో... పరుగు తీసే ముందు, ఎందుకో ఒక్క క్షణం ఆగి, నిటారుగా నిలుచున్నట్టుందది...

పన్నెండేళ్ల క్రితం మాంత్రికుని మంత్ర దండంలా, నన్ను వివశుణ్ణి చేసి, ఇరవైయేళ్ల నా జీవిత గతిని నిర్దాక్షిణ్యంగా అస్తవ్యస్తం చేసిన దృశ్యం అది!

అది... అదొక కొ...య్య...గు...ర్రం...!

* * *

... కొయ్యగుర్రం...

ఇంతలేసి కళ్లతో... చురుకైన చూపుల్తో... అందంగా... అమాయకంగా... ఆకర్షణీయంగా... ఆకట్టుకునే రంగుల్తో... విశాలమైన దివాణం చావడిలో నా కంటికి అద్భుతంగా... అపూర్వంగా కనిపించిందా కొయ్యగుర్రం!

తెల్లారగట్ల పులిరాజుగారి దివాణంలో నూతి గట్టున కూర్చుని నొసటపైకి, జారుతూన్న వెంట్రుకల్ని వెనక్కి ఎగదోసుకుంటూ... అమ్మ బండెడు అంట్లు తోముతుంటే... ఎనిమిదేళ్ల వయసులో... ఏమీ తెలీనితనంలో అటూ ఇటూ తచ్చాడుతున్న నాకు దివాణం చావడిలోని ఆ కొయ్య గుర్రాన్ని చూస్తూంటే... జానపద కథల్లో కానవచ్చే 'పంచకళ్యాణి'లా... మేఘాల్లో ఎగురుతూ... గగన విహారం చేసే 'కీలుగుర్రం'లా ఎంతో అబ్బురంగా అనిపించింది.

ఒక్కసారి దాని వీపుపై కూర్చుంటే...

కూర్చుని అలా ముందుకీ వెనక్కీ ఊగితే...

గాల్లో తేలుతూన్నట్టుంటదా...

గగనంలో ఎగురుతూన్నట్టుంటదా...

అంతలో... నా రంగు రంగుల ఊహల పట్టు పరదాల్ని నిర్దాక్షిణ్యంగా చించేస్తూ, ఎక్కణ్ణించి ఊడిపడ్డాడో... పులిరాజుగారి మనవడు 'వంశీబాబు' చెంగు చెంగున గెంతుకుంటూ వచ్చి, దర్జాగా దానిమీద ఎక్కి కూర్చుని, 'చల్ చల్ గుర్రం... చలాకి గుర్రం...' అంటూ సవారీ మొదలెట్టాడు; పట్నంలో ఖరీదైన ఇంగ్లీషు బడిలో మూడో క్లాసు చదూతున్నాట్ట! అమ్మ చెప్పింది. వంశీ బాబుని అలా చూస్తూంటే నాక్కూడా ఒక్కసారి... కనీసం ఒక్కసారైనా... ఆ కొయ్య గుర్రాన్నెక్కి 'కొండవీటి దొంగ'లా, స్వారీ చేయాలనిపించింది.

ఆ క్షణం కళ్లెం తెగిన గుర్రంలాంటి ఆ కోరికను అదుపు చేయడం నావల్ల కాలేదు.

అటు ఇటు చూసాను...

గొడ్ల చావిడ్లో పశువులకు మేతవేస్తూ కొందరు.. కసవూడుస్తూ మరి కొందరు... పాలేళ్లు ఎవరి పనుల్లో వాళ్లున్నారు. ఇక అమ్మ సంగతి సరేసరి! వొంచినా తలెత్తకుండా, ఎప్పుడో తన అంట్ల ప్రపంచంలో మునిగిపోయింది.

ఇదే అదననుకుని నేను గుట్టుచప్పుడు కాకుండా, 'గప్ చుప్'గా పనస చెట్టు మాటుగా దివాణం మెట్లెక్కి,

ముందున్న హాలులోకి నడిచాను...

ఆ పెద్ద హాలులో... పులిరాజుగారి మనవడు వంశీబాబు ఒంటరిగా ఆ కొయ్యగుర్రం మీద స్వారీ చేస్తూనే ఉన్నాడు...

నేను కాసింత దగ్గరగా వెళ్లి నిలబడ్డాను.

పాతవే అయినా... చినుగుపట్టినవే అయినా, శుభ్రంగా ఉతికిన బట్టల్తో... గానుగ కొబ్బరినూనె రాసి, చక్కగా దువ్విన క్రాపుతో ఉన్న నన్ను ఓసారి ఎగాదిగా చూసి, ఏం కావాలన్నట్టు పొగరుగా కనుబొమలెగరేసాడు వంశీబాబు. ఆ రక్తంలోనే ఆ పొగరుందో ఏమో... ఆ చూపులు నాకిప్పటికీ గుర్తే...!

నేను మరికాస్త దగ్గరగా వెళ్లి, నాక్కూడా ఒక్కసారి ఆ గుర్రానెక్కాలనుందని చేత్తో సౌంజ్ఞ చేసాను. తను ఏమాత్రం పట్టించుకోలేదు, సరికదా... పూనకం వచ్చిన వాడిలా ఊగడం మొదలెట్టాడు. అయినా, నా ఆశ చావలేదు. బతిమిలాడాను; అతి దీనంగా కాళ్లావేళ్లా పడ్డాను. ఇంత చేసినా సరే, వంశీబాబు నన్నో పురుగును చూసినట్టుచూసి, పిచ్చిగా మరింత రెచ్చిపోయి ఊగుతూ, తన ఎడమ కాలితో దురుసుగా నన్నో తన్ను తన్నాడు. ఆ తాపుకి కిందపడ్డా నాలో, ఆశ... సహనం స్థానే ఏదో తెలీని కసి రేగింది. దిగ్గున లేచి, విసురుగా ఒక్క తోపు తోసాను. అంతే!... ఆ తోపుకు వంశీబాబు బంతిలా ఎగిరిపడటం... ఆ పడటంలో అతడి లేత తలకాయ నల్లటి నాపరాయి నేలను తాకటం... అది టెంకాయలా చిట్లటం... ఒక్కసారిగా ఎర్రటి నెత్తురు జివ్వుమంటూ ఎగజిమ్మడం... అప్పుడే కొడుక్కి పాలు పట్టుకొచ్చిన పులిరాజు పెద్ద కూతురు ఆ దృశ్యాన్ని చూడటం...

క్షణాల్లో సన్నివేశం మారిపోయింది!

"అమ్మో... నా కొడుకుని చంపేశాడమ్మో... చంపేశాడు..." అంటూ ఆవిడ కేకలు వేయడం... ఆ కేకలకి అంతవరకూ చేస్తూన్న పనుల్ని ఎక్కడివక్కడ ఆపేసి, బాణా కర్రల్తో పాలేళ్లు పరిగెత్తుకు రావడం...

నేను బిత్తరపోయి, భయంతో పరుగులంకించుకున్నాను...

పరుగు... పరుగు... ఒకటే పరుగు... కోవెల మెట్లు... కోనేటి గట్టు... పొలాల గట్లు... తుమ్మ తోపు... తాటి తోపు... అన్నిటినీ దాటుకుంటూ... దొక్కుంటూ... పడుతూ... లేస్తూ... రొప్పుతూ... రోజుతూ... పరుగే... పరుగు... ఒకటే పరుగు... సమయం తెలీని పరుగు... అలుపు... ఆయాసం... నీరసం... నిస్సత్తువ... శోష...

స్పృహ తప్పాను...

★ ★ ★

... స్పృహలోకొచ్చి, చెమటలు పట్టిన ముఖాన్ని అరచేతుల్తో కప్పుకుని, చాలాసేపు అలానే ఉండిపోయాను.

ఎంత భయానకమ్మైన అనుభవం...!

ఎప్పుడో పన్నెండేళ్ల క్రితం గతం... ఇప్పుడే... ఈ క్షణమే జరుగుతూన్నంత భావన... చాలాసేపటి వరకూ, మళ్లీ మామూలు మనిషిని కాలేకపోయాను.

విధి ఎంత బలీయం...! ఎంత కఠినం...!

కనులు తెరవక ముందే పులిరాజుగారి పొలంలో, పాము కాటుకి బలైన తండ్రి... నాన్న పోయాక అన్నీ తానే అయి, ఎనిమిదేళ్లపాటు నన్ను కంటికి రెప్పలా సాకిన అమ్మ... పులిరాజుగారి మనవడి మరణంతో, వూరి మనుషుల మధ్య మనలేక కోనేట్లో మునిగి, అసువులు బాసిన అమ్మ... ఇక ఏముందీ బతుక్కి... గాలివాటుకి కాగితంలా... కాల ప్రవాహానికి జీవితంలా... కొట్టుకుపోతూ... నెట్టుకుపోతూ... పన్నెండేళ్ల కాల ప్రవాహంలో ఈదుతూ... ఎదురీదుతూ... మునుగుతూ... తేలుతూ... ఇప్పటికి ఇదీ నా స్థితి... జీవితానికో లక్ష్యం లేదు... గమ్యం లేదు...

నష్ట జాతకుణ్ణి... ఏనాడూ మనసారా నవ్వడం ఎరుగని నేను, ఇపుడు కనీసం మనసారా ఏడవ గలుగుతున్నాను...

ధారాపాతంగా కారుతూన్న కన్నీళ్లను నా అరచేతులు ఆపలేకపోతున్నాయి. సమయమెంత గడిచిందో తెలీదు. తెరిపిచ్చిన కళ్లను తెరిచాక, చూస్తే ఎదురుగా...

నా పసితనపు వసివాడని పసిడి కలలా...

నా భావి జీవిత సౌధాన్ని ముంచెత్తిన పైశాచిక అలలా...

ఆ పాత కాలపు కొయ్యగుర్రం ఏమీ ఎరుగని నంగనాచిలా, నా చేతికి అందేంత దూరంలో ఉంది.

ఇప్పుడది నాలా ఒంటరిది...!

ఇక్కడ దాని యజమానీ లేడు... హక్కుదారుడూ లేడు... కనీసం కాపలాదారుడూ లేడు...

ఉన్నది నేనే...! కేవలం నేనే...!!

ఇంతవరకూ నా భుజాన భారంగా వ్రేలాడుతూన్న సంచీని కసిగా నేలకు విసిరికొట్టాను. ఆ విసురుకి అందులోని నగలూ... నగదూ... నేలపై చిందర వందరగా చెల్లాచెదురైనాయి.

చేయి చాచి, రంగు వెలిసి, ఏ హంగూ లేని ఆ కొయ్యగుర్రాన్ని ఆప్యాయంగా తడిమాను... దానిపై పేరుకుపోయిన దుమ్మూ... ధూళినీ మురిపెంగా తుడిచాను...

నాలో ఏదో తెలీని భావోద్వేగం...

ఒక్కసారి దీర్ఘంగా శ్వాసించి... సంతృప్తిగా నిట్టూర్చి... నెమ్మది దానిపై కూర్చున్నాను.

కొద్దిక్షణాల క్రితం వరకూ ఎంతో విలువైనవిగా అనిపించిన బంగారు నగలూ... నత్రా ఇపుడు నాకేమీ అనిపించడం లేదు. ఆర్రోజులుగా, నా కడుపుని, నకనకలాడించిన ఆకలీ గుర్తురావడంలేదు... నా కంటి నిండుగా ఆ కొయ్యగుర్రమే కనిపిస్తోంది... ఇపుడు నేను తీర్చుకుంటున్న నా తీరని చిననాటి చిరుకోరిక వాటికన్నా ఎన్నో రెట్లు విలువైందిగా అనిపిస్తోంది...

కొద్దిక్షణాల క్రితం వరకూ ఎంతో విలువైనవిగా అనిపించిన బంగారు నగలూ... నత్రా ఇపుడు నాకేమీ అనిపించడం లేదు. ఆర్రోజులుగా, నా కడుపుని, నకనకలాడించిన ఆకలీ గుర్తురావడంలేదు... నా కంటి నిండుగా ఆ కొయ్యగుర్రమే కనిపిస్తోంది..

అవును! ఇపుడు నా బాల్యపు బంగరు నిధిని స్వేచ్ఛగా కొల్లగొడుతున్నాను...

నేను నెమ్మదిగా ఊగడం మొదలుపెట్టాను...

నా జ్ఞాపకాల రంగుల రాట్నం, పన్నెండేళ్ల వెనక్కి గిర గిరా తిరుగుతోంది...

ఇపుడు నాకు మా వూరు గుర్తొస్తోంది...

ఆ మట్టివాసన గుర్తొస్తోంది...

మా అమ్మ గుర్తొస్తోంది...

అమ్మ ఒడి గుర్తొస్తోంది...

మా వూరి బడి గుర్తొస్తోంది...

బడిలో అయ్యవారి పిలక ముడి గుర్తొస్తోంది...

మా వూరి గుడి గుర్తొస్తోంది...

గుడి మీది పావురాళ్ల సందడి గుర్తొస్తోంది...

మా వూరి కోనేరు గుర్తొస్తోంది...

కోనేటిపై ఎగిరే కొంగల బారు గుర్తొస్తోంది...

కోనేట్లోని తామర తంపర గుర్తొస్తోంది...

ఇపుడు నా పెదవులపై సన్నపాటి దరహాస వీచిక...

అది మెదిలి... మెదిలి... కదలి... కదలి...

కడలి హోరైంది...

ఇపుడు నేను నవ్వుతున్నాను...
పకపకా నవ్వుతున్నాను...
పగలబడి నవ్వుతున్నాను...
ఫెడీ... ఫెడీ... నవ్వుతున్నాను...
స్వచ్ఛంగా నవ్వుతున్నాను...
స్వేచ్ఛగా నవ్వుతున్నాను...
అవును...నేను నవ్వుతున్నాను...
ఏం భయం... బెరుకూ లేకుండా...
హాయిగా...ఆహ్లాదంగా నవ్వుతున్నాను...
నేను నవ్వుతున్నాను... నవ్వుతూ ఊగుతున్నాను...
నేను ఊగుతున్నాను... కుతిదీరా ఊగుతూనే ఉన్నాను... ★

